క్లుప్తంగా

నేడు యోగాంధ్ర ప్రదర్శనలు

పొదలకూరు : మండలంలో శనివారం యోగాంధ్ర ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ డీవీ నరసింహారావు శుక్రవారం తెలిపారు. 23 సచివాలయాల పరిధిలో గుర్తించిన 209 ప్రదేశాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు యోగా సాధనపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు వివరించారు.

అగ్రిల్యాబ్ ఏఓ బాధ్యతల స్వీకరణ

పొదలకూరు : స్థానిక నిమ్మమార్కెట్ యార్డులో ఉన్న అగ్రికల్చర్ ల్యాబ్ ఏఓగా జ్యోత్స్న శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఆమె నెల్లూరు భూసార పరీక్ష కేంద్రంలో పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఏఓగా ఉన్న శ్రీదేవి నెల్లూరు ఏడీఏ కార్యాలయం ఏఓగా బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏఓ జ్యోత్స్న మాట్లాడుతూ రైతులు అందజేసే విత్తనాలకు పరీక్షలు నిర్వహించి నాణ్యత కలిగిన వాటిని రైతులు వినియోగించేందుకు కృషి చేస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇందుకూరుపేట: విద్యుత్‌లైన్ల మరమ్మతుల దృష్ట్యా మండలంలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు డిప్యూటీ ఈఈ సురేంద్రబాబు శుక్రవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

తోటపల్లిగూడూరు: తోటపల్లిగూడూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ల మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఏఈ సుకుమార్ తెలిపారు. వరకవిపూడి, అనంతపురం, సౌలిపేట, మాచర్లవారిపాళెం, పేడూరు, పాపిరెడ్డిపాళెం గ్రామాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు.

కోవూరు: చిన్నపడుగుపాడు, పడుగుపాడు సబ్‌స్టేషన్ల పరిధిలోని శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు డీఈఈ కే మధుసూదన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. విద్యుత్‌లైన్ల మరమ్మతుల దృష్ట్యా చిన్నపడుగుపాడు, బండారు మాన్యం, స్టాబిడీ కాలనీ, పడుగుపాడు, గంగవరం తదితర ప్రాంతాలలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వివరించారు.

విడవలూరు: మండలంలోని వావిళ్ల, ముదివర్తి గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఏడీ వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరాను నిలిపివేస్తున్నామని వివరించారు.

కొడవలూరు: మండలంలోని గండవరం, యల్లాయపాళెం, కొత్తవంగల్లు, రామన్నపాళెం, పద్మనాభసత్రం సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు డీఈఈ, ఏఈలు టీ వెంకటేశ్వర్లు, ఎం రాములు శుక్రవారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్లలో మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నామని వివరించారు.

కత్తితో దాడి

నెల్లూరు(క్రైమ్): ఓ వ్యక్తిపై కత్తితో దాడికి యత్నించగా అడ్డువెళ్లిన వ్యక్తికి గాయమైన ఘటనపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. నగరానికి చెందిన కృష్ణ మూలాపేట రావిచెట్టు సెంటర్లో బైక్ మెకానిక్ షాపు నిర్వహిస్తున్నాడు. ఇరుగాళమ్మ సంఘానికి చెందిన వేణు గురువారం సాయంత్రం బైక్ రిపేర్ చేయించుకునేందుకు అక్కడికి వచ్చాడు. కృష్ణ వస్తువులు తెచ్చుకోవాలని సూచించగా సదరు వేణు అతడితో గొడవకు దిగాడు. షాప్‌లో ఉన్న కృష్ణ బావమరిది వెంకటేష్, పనిచేస్తున్న మరో వ్యక్తి వేణుని అడ్డుకున్నారు. దీంతో అతను అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కొద్దిసేపటి తరువాత వేణు తిరిగి షాపునకు వచ్చి కృష్ణపై కత్తితో దాడికి యత్నించగా వెంకటేష్ అడ్డుకోగా అతడిపై దాడి చేశాడు. ఈ ఘటనలో వెంకటేష్ చేతికి స్వల్ప గాయమైంది. ఈ మేరకు బాధితుడు శుక్రవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక రేపు

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని శ్రీవాకాటి నరసయ్య త్యాగరాజ కల్యాణ మండపంలో రాష్ట్ర స్థాయి బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదికను ఆదివారం నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహకుడు ఇసుకపల్లి కామేశ్వరప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల పరిధిలోని వధూవరులకు సంబంధించిన వివరాలతో తల్లిదండ్రులు వస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగిసిన శిక్షణ

నెల్లూరు(బృందావనం): కొండాయపాళెం రోడ్డులోని జీసెస్ సెంటర్‌లో గ్రేస్ ఆఫ్ గాడ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో రీరైట్ లైఫ్ సౌజన్యంతో ఆర్‌డబ్ల్యూ 4 జీజీఎం రెవరెండ్ డి.ఏసుపాదం నేతృత్వంలో నాలుగురోజులుగా జరుగుతున్న 'అడల్ట్ లిటరసీ టీచర్స్ ట్రెనింగ్ ప్రోగ్రాం' శుక్రవారంతో ముగిసింది. బిషప్ పి.ఆంథోనిదాస్ హాజరై జ్యోతి వెలిగించి శిక్షణ తరగతులు ప్రారంభించి, దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ జాన్సన్, మిషన్ డైరెక్టర్ రిబేకా, జార్జివిల్సన్, శ్రీనివాస్, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ఉషాకిరణ్ పాల్గొన్నారు. సామాజిక, ఆర్థికాభివృద్ధి, దేశ ప్రగతి విషయాలను వివరించారు.

ఎడగారు సాగేనా?


చెన్నారెడ్డిపల్లి వద్ద 26ఎల్ కాలువలో పారని సాగునీరు


నీరు లేని నారుమడిని చూపుతున్న రైతు

- దక్షిణకాలువ గేట్‌లో సాంకేతిక లోపం
- స్వల్పంగా విడుదలవుతున్న సాగునీరు
- బ్రాంచ్‌కాలువలపై మోటార్ల వినియోగంతో ముందుకు సాగని సాగునీరు
- ఎండిపోతున్న నారుమడులు
- ఆందోళన చెందుతున్న చివరిఆయకట్టు రైతులు

పొదలకూరు : మండలంలోని చెన్నారెడ్డిపల్లి, నావూరు, భోగసముద్రం, బత్తులపల్లి, చేజర్ల మండలం కొండలరాయుడుకండ్రిక గ్రామాలకు దక్షిణ కాలువ, దాని ఉపకాలువల ద్వారా సాగునీటి సౌకర్యం ఉంది. నాన్‌డెల్టా కింద ఉండే ఈ గ్రామాలకు ఏటా రబీ సీజన్‌లో సాగునీరు అందించడం వల్ల వరి పంట పండుతుంది. అయితే ఈ ఏడాది సోమశిల ప్రాజెక్ట్‌లోని నీరు రెండో పంటకు సరిపోతుందని అధికారులు వెల్లడించడంతో పాటు నాన్‌డెల్టా ప్రాంత రైతులను పరిమితంగా ఎడగారు సాగు చేసుకోవాలని సూచించారు. దీంతో ఆయా గ్రామాల రైతులు వరినార్లు పోసుకున్నారు. అయితే సోమశిల నుంచి దక్షిణ కాలువకు నీటిని విడుదల చేసే గేట్‌కు సంబంధించి సాంకేతిక లోపం ఏర్పడడంతో ప్రస్తుతం 350 క్యూసెక్కులు మాత్రమే నీరు విడుదల అవుతున్నాయి. దీంతో చివరి ఆయకట్టుగా ఉన్న మండలంలో గ్రామాలకు సాగునీరు అందడం లేదు. ఎగువ ప్రాంతంలోని రైతులు విద్యుత్ మోటార్లను వినియోగించడంతో చివరి ఆయకట్టుకు సాగునీరు చేరడం లేదు. దీంతో నారుమడులను కాపాడుకునేందుకు రైతులు నానా పాట్లు పడుతున్నారు.

ఎండిపోతున్న నారుమడులు

దక్షిణ కాలువ, దాని ఉప కాలువలైన 7ఆర్, 26ఎల్ ద్వారా చివరి ఆయకట్టుగా ఉన్న చెన్నారెడ్డిపల్లి, నావూరు, భోగసముద్రం, కొండలరాయుడుకండ్రిక గ్రామాలకు సాగునీరు అందడం లేదు. దీంతో రైతులు నారుమడులను కాపాడుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు రైతులు రాత్రుళ్లు నిద్రమానుకుని కాలువలో స్వల్పంగా వచ్చే నీటిని నారుమడులకు పెట్టుకుంటున్నారు. చెన్నారెడ్డిపల్లిలో 400, భోగసముద్రంలో 100, కొండలరాయుడుకండ్రికలో 400 ఎకరాలకు సరిపడా నారుమడులను రైతులు పోసుకుని ఉన్నారు. మరో 15 నుంచి 20 రోజుల వరకు నారుమడులను కాపాడుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఇప్పటి వరకు రైతులు స్వల్పంగా కాలువకు వచ్చే నీటిని వంతుల వారీగా పారించుకుని నారుమడులను కాపాడుకోగలిగారు. అయితే ఇప్పటికే కొంతభాగం నారుమడులు ఎండుదశలో ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దక్షిణ కాలువ పరిశీలన

సోమశిల ప్రాజెక్టు దక్షిణ కాలువ, కండలేరు వరద కాలువలను సోమశిల ఎస్ఈ వెంకటరమణారెడ్డి బుధవారం పరిశీలించారు. కాలువల ద్వారా చివరి ఆయకట్టుకు సాగునీరు అందడం లేదని గుర్తించారు. సోమశిల ప్రాజెక్టు వద్ద దెబ్బతిన్న దక్షిణ కాలువ గేట్ల మరమ్మతు పనులను పరిశీలించారు. అనంతరం చివరి ఆయకట్టుకు నీటిని సవ్యంగా విడుదల చేయడంపై సంబంధిత అధికారులతో సాధ్యాసాధ్యాలపై చర్చించినట్టు సమాచారం. అయితే దక్షిణ కాలువ గేట్ల మార్పిడి పనులు మరో రెండు, మూడు రోజులు పట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈలోగా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారానైనా దక్షిణ కాలువ, దాని ఉప కాలువకు నీటిని విడుదల చేసే అంశాలపై కూడా ఇంజనీరింగ్ అధికారులు యోచిస్తున్నట్టు తెలిసింది.

సాగునీటికి ఇబ్బంది లేదు

సోమశిలలో ఐఏబీ సమావేశంలో నిర్దేశించిన మేరకు నీరు ఉంది. దక్షిణ కాలువ గేట్లకు సంబంధించి సాంకేతిక లోపం ఏర్పడడంతో చివరి ఆయకట్టుకు సాగునీరు సవ్యంగా అందడంలేదు. రెండు, మూడురోజుల్లో గేట్లను మారుస్తాం. వీలుకాని పక్షంలో ప్రత్యామ్నాయంగా కాలువకు సాగునీటిని విడుదల చేస్తాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– సుధాకర్, ఏఈ, సోమశిల చేజర్ల డివిజన్.

సామూహిక అక్షరాభ్యాసం



పొదలకూరు : అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొనగలూరు అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. తొలుత సరస్వతి పూజ నిర్వహించి మూడేళ్ల నిండిన చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు మూడేళ్లు నిండిన తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు.

మలేరియా నిర్మూలనకు కృషి


నీటిని పారబోస్తున్న అధికారులు

నెల్లూరు(అర్బన్): మలేరియా వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా మలేరియా నివారణ విభాగం సహాయాధికారి నాగార్జునరావు సూచించారు. మలేరియా అవగాహన మాసోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని పీసీనాయుడు వీధి పట్టణ ఆరోగ్య కేంద్రం, జాఫర్ సాహెబ్ కెనాల్ పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జునరావు మాట్లాడుతూ దోమలు కుట్టకుండా, పుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా మలేరియాను అంతం చేయొచ్చన్నారు. చలి, జ్వరంతో కూడిన లక్షణాలుంటే మలేరియా పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం జాఫర్ సాహెబ్ కెనాల్ ప్రాంతంలోని ఇళ్లను సర్వే చేసి నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సునీల్, మలేరియా నివారణ సిబ్బంది శ్యాంసన్‌బాబు, రామారావు, ల్యాబ్ టెక్నీషియన్ చాణక్య, సబ్‌యూనిట్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఎన్ఎంసీలో బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(బారకాసు): ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా వేర్వేరు ప్రాంతాల నుంచి పలువురు అధికారులు నెల్లూరు నగరపాలక సంస్థలోని పలు విభాగాలకు బదిలీ వచ్చారు. శుక్రవారం ఎన్ఎంసీలోని ఆయా విభాగాల్లో వారంతా బాధ్యతలు స్వీకరించారు. ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా బీఎంవీ నరసింహారావు, ఇంజినీరింగ్ విభాగం ఇన్‌చార్జి ఈఈగా అనిల్‌కుమార్ అలాగే ఏఈగా అర్పిత, పట్టణ ప్రణాళికా విభాగం అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా రఘునాథరావు, ఎఫ్ఏసీ ఎగ్జామినర్‌గా డి.సింహాద్రి బాధ్యతలను స్వీకరించారు. ఈ మేరకు వారు కమిషనర్ నందన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

హార్టికల్చర్ అధికారి నియామకం


నరసింహారావు

నెల్లూరు(బారకాసు): నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ హార్టికల్చర్ (ఉద్యాన శాఖ) అసిస్టెంట్ డైరెక్టర్‌గా బీఎంవీ నరసింహారావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన అనంతపురం జిల్లా ఉద్యాన శాఖ సహాయ సంచాలకుడిగా విధులు నిర్వర్తిస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. ఇదే స్థానంలో ఇప్పటి వరకు ఏడీ హార్టికల్చర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రదీప్‌కుమార్‌ను విజయవాడలోని ఔషధ సుగంధ ద్రవ్యాల విభాగం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ అధికారిగా నియమించారు.

ప్రతిభా అవార్డులకు విద్యార్థుల ఎంపిక


విద్యార్థులను సన్మానించిన ప్రిన్సిపల్ తదితరులు

నెల్లూరు(టౌన్): స్థానిక కేపీసీ జూనియర్ కళాశాలలో చదివి రాష్ట్ర ప్రతిభా అవార్డులకు ఎంపికైన విద్యార్థులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. కాలేజీలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ షేక్ అక్బర్, 978, యోషిక 946 మార్కులు సాధించి అవార్డులకు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు రవికృష్ణ, చెంచయ్య, పాటూరు వేణుగోపాల్‌రెడ్డి, పెద్ద అప్పలనాయుడు, సంజయ్‌బాబు, హరికృష్ణ పాల్గొన్నారు.

వైద్యశాఖలో బదిలీల ప్రక్రియ ప్రారంభం


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎంహెచ్ఓ

నెల్లూరు(అర్బన్): జిల్లా వైద్యారోగ్య శాఖలో బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది. శుక్రవారం 19 సబార్డినేటర్లు, ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లు, 9 మంది జూనియర్ అసిస్టెంట్లకు డీఎంహెచ్ఓ సుజాత ఆధ్వర్యంలో నెల్లూరు సంతపేటలోని కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించి సీనియారిటీని బట్టి బదిలీల్లో ప్రాధాన్యత కల్పించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ బదిలీల ప్రక్రియను పారదర్శకంగా చేస్తున్నామన్నారు. ఒక్కో జు ఒక్కో విభాగానికి చెందిన ఉద్యోగులకు కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహిస్తామన్నారు.

జిల్లా స్థాయి పాటల పోటీలు


పోటీల్లో పాల్గొన్న ఔత్సాహికులతో అధికారులు

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో యోగాంధ్ర మూడోరోజు పోటీల్లో భాగంగా జిల్లా స్థాయిలో పాటల పోటీలను శుక్రవారం నిర్వహించారు. 60 మంది పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలు ఆరుగురిని విజేతలుగా ప్రకటించారు. యోగా స్లోగన్ పోటీల్లో ఒకరు విజేతగా నిలిచారు. వీరందరూ త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని కమిషనర్ నందన్ ప్రకటించారు. సెట్నెల్ సీఈఓ నాగేశ్వరరావు, డీఎస్డీఓ యతిరాజు, యోగా గురువులు పోటీలను పర్యవేక్షించారు.

స్వల్పంగా పెరిగిన నిమ్మధరలు


మార్కెట్‌కు వచ్చిన నిమ్మ కాయలు

పొదలకూరు : పొదలకూరు నిమ్మ మార్కెట్లో నిమ్మకాయల ధరలు స్వల్పంగా పెరిగాయి. ప్రస్తుతం మార్కెట్లో కిలో కాయలు రూ.25 నుంచి రూ.37 వరకు పలుకుతున్నాయి. దీంతో శుక్రవారం పొదలకూరు మార్కెట్‌కు కాయలు విపరీతంగా వచ్చిపడినట్టు వ్యాపారులు వెల్లడించారు. వర్షాల కారణంగా కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ ప్రాంతం నుంచి ఢిల్లీ మార్కెట్‌కు నిమ్మకాయల ఎగుమతులు రెండ్రోజులుగా లేకపోవడంతో ధరలు స్వల్పంగా పెరిగినట్లుగా వ్యాపారులు తెలిపారు. ఈ ధరలు మళ్లీ తగ్గుముఖం పట్టే పరిస్థితి ఉందంటున్నారు. ఇటీవల మార్కెట్‌కు నిమ్మకాయలు అధికంగా వస్తుండడంతో నిమ్మమార్కెట్ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. రైతులు తోటల్లోని కాయలను ఏమిచేసుకోవాలో తెలియక గిట్టుబాటు ధరలు లేకున్నా కోసి మార్కెట్‌కు తరలిస్తున్నారు. వ్యాపారులు సైతం వేలంవెర్రిగా వస్తున్న కాయలను ఎగుమతి చేయలేక సతమతమవుతున్నారు. దసరా వరకు పరిస్థితులు ఇలాగే ఉంటాయని చెబుతున్నారు.

అన్నదాత సుఖీభవకు ఈకేవైసీ తప్పనిసరి


మాట్లాడుతున్న ఏడీ అనిత

కోవూరు: అన్నదాత సుఖీభవ పథకానికి ఈకేవైసీ తప్పనిసరని, వీఏఏలు అర్హుల జాబితాలోని రైతులందరికీ అవగాహన కల్పించి ఈకేవైసీ చేయించుకునేలా చూడాలని కోవూరు ఏడీ అనిత అన్నారు. కోవూరు వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాలకు సంబంధించిన ఏఓలు, వీఏఏలతో కోవూరు మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈకేవైసీ చేయించని కారణంగా తమకు అన్నదాత సుఖీభవ నిధులు జమ కాలేదని రైతులు చెప్పకూడదన్నారు. దీనిని దష్టిలో పెట్టుకుని రైతులకు అవగాహన కల్పించి యుద్ధప్రాతిపదికన ఈకేవైసీని నూరుశాతం పూర్తి చేయాలన్నారు. గతంలో కూడా ఈకేవైసీ సక్రమంగా చేయని కారణంగా రైతులు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. పండించిన పంటను రైస్‌మిల్లులకు తరలించే క్రమంలో రైతులు ఇబ్బందులు పడిన సందర్భాలు ఉన్నాయన్నారు. అటువంటివి మళ్లీ పునరావృతం కాకుండా వీఏఏలు వారి పరిధిలోని రైతుల ఈకేవైసీ కార్యక్రమాన్ని నూరుశాతం పూర్తి చేయాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి వక్తృత్వ పోటీలకు మనుబోలు బాలికలు


లక్ష్మీసాహితి, ఉషారాణి

మనుబోలు: మనుబోలుకు చెందిన ఇద్దరు బాలికలు రాష్ట్రస్థాయి వక్తృత్వ పోటీలకు ఎంపికయ్యారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 12న నెల్లూరులో నిర్వహించిన జిల్లాస్థాయి వక్తృత్వ పోటీల్లో 19 ఏళ్ల లోపు విభాగంలో మనుబోలుకు చెందిన తాంబరపు లక్ష్మీసాహితి, బండికట్టు ఉషారాణి రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ఎంపీడీఓ ఉషారాణి, మనుబోలు పంచాయతీ కార్యదర్శి గరుడయ్య, యోగా శిక్షకుడు చెలికం కోటేశ్వరరెడ్డి శుక్రవారం అభినందించారు.

పది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



ఇందుకూరుపేట: మండలంలోని ముదివర్తిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతిలో ప్రతిభకనబర్చిన విద్యార్థులకు గణేష్ సేవా మిత్ర మండలి, లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు ఆధ్వర్యంలో శుక్రవారం నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన నెహెల్ పార్కత్ (591), నవ్యకుమారి (580), మహేష్ (563)కు రూ.10వేలు చొప్పున నగదు, నోట్‌పుస్తకాలను పంపిణీ చేశారు. నేదురుమల్లి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గణేష్ సేవా మిత్ర మండలి, లయన్స్ క్లబ్ వ్యవస్థాపకులు, క్లబ్ సభ్యులు సుబ్బారెడ్డి, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి సన్నిధిలో విశేష పూజలు



నెల్లూరు(బృందావనం): రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం రాహుకాల ఉద్యాపన పూజలను విశేషంగా నిర్వహించారు. 28 మంది పాల్గొని అమ్మవారికి చీర, జాకెట్లు, 108 నిమ్మకాయలతో మాల సమర్పించారు. రాహుకాల దీపాలు వెలిగించి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం వేదపారాయణం, సంధ్యామేళం, రాత్రి కుంభహారతులు, పల్లకి సేవలను విశేషంగా జరిపారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్దనరెడ్డి పర్యవేక్షించారు.

నేత్రపర్వంగా తెప్పోత్సవం


తెప్పపై విహరిస్తున్న చాముండేశ్వరిదేవి (ఇన్‌సెట్లో) విశేషాలంకారంలో అమ్మవారు

ఇందుకూరుపేట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గంగపట్నంలోని చాముండేశ్వరిదేవి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరిరోజు శుక్రవారం రాత్రి తెప్పోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. చాముండేశ్వరిదేవి, త్రిశూలేశ్వర స్వామిని ఉత్సవమూర్తులను వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి ఆలయం వెనుక భాగంలో ఉన్న కోనేరులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తెప్పపై కొలువుదీర్చి తెప్పోత్సవం నిర్వహించారు. ఉభయకర్తలుగా నావూరు శ్రీనివాసమూర్తి,హైమావతి, నావూరు మురళీమనోజ్‌కుమార్, అరుణ, శంతన్‌కృష్ణ, దేదీప్య వ్యవహరించారు. తొలుత అమ్మవారికి విశేష పూజలు, పూలాంగి సేవ నిర్వహించారు. ఉభయకర్తలుగా హైదరాబాద్‌కు చెందిన పాలగిరి రమేష్,చాముండేశ్వరి, పాలగిరి సందీప్, లాస్య దంపతులు వ్యవహరించారు. స్థానికులు పెనుబల్లి రామచంద్రనాయుడు,యామిని కృష్ణ దంపతులు భక్తులకు ప్రసాదాలు వితరణ చేశారు.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ మహోత్సవం

చాముండేశ్వరిదేవి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం వేకువజామున అగ్ని గుండ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉపవాస దీక్ష బూనిన భక్తులు అగ్నిగుండం తొక్కి భక్తిని చాటుకున్నారు. అనంతరం ధ్వజావరోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విఘ్నేశ్వరయాత్ భక్తులకు ప్రసాద వితరణలు చేశారు. కోవూరు సీఐ కే సుధాకర్ రెడ్డి, ఎస్సై నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.